## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**తెలకపల్లి:** మండలంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ స్వంతస్‌తేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ రాకొండ లైన్ పరిధిలో విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో గోలగుండం, పెద్దూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరి నిలిపివేస్తునట్లు తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### మోస్తరు వర్షం

**నాగర్‌కర్నూల్ రూరల్:** పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో శనివారం సాయంత్రం గంట పాటు ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. రోడ్లపై నీరు పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో రైతులు పొలాల్లో విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతున్నారు.

### 4.5 కిలోల శిశువు జననం



**నాగర్‌కర్నూల్ క్రైం:** జనరల్ ఆస్పత్రిలో ఓ గర్భిణి సాధారణ ప్రసవం ద్వారా 4.5 కేజీల బరువు ఉన్న శిశువుకు జన్మనిచ్చిందని జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రఘు శనివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన ఓ గర్భిణి కడుపులో 4.5 కిలోల శిశువు ఉన్నట్లు గుర్తించిన గైనకాలజి విభాగం హెచ్‌ఓడీ డా. నీలిమ, డా. సుప్రియ గుర్తించారు. సాధారణ ప్రసవంలో మగశిశువుకు జన్మనిచ్చిందని పేర్కొన్నారు.

### కొనసాగుతున్న ధార్మిక కార్యక్రమాలు

**తిమ్మాజిపేట:** మండలంలోని ఇప్పలపల్లిలో తిరుమల, తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వక్తల ఉపన్యాసాలు, శ్రీరామాయణ భజన, హనుమాన్ చాలీసా భక్తులచే ఆలపించారు. కార్యక్రమంలో నాగేశ్వర్, శేఖర్, ఆంజనేయులు, ఉసెనయ్య, వెంకట్రాములు, నాగరాజు, దశరథం, గోపాల్ రెడ్డి, తిరుపతి, మన్యం, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

### పేదలకు అండగా ఉంటాం



**తెలకపల్లి:** పేదలకు అండగా ఉంటామని రాష్ట్ర కమిటీ సభ్యుడు కేశవులుగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దపల్లిలో సీపీఐ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 10న మండల మహాసభ నిర్వహిస్తునట్లు పేర్కొప్పారు. పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తయ్యిందని ఈ సందర్భంగా గ్రామాల్లో పార్టీ జెండాలు ఎగురవేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులందరికి ఇవ్వాలన్నారు. రాజీవ్ యువశక్తి పథకంలో సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బుగ్గస్వామి, సహాయ కార్యదర్శి బిచ్చలు, సీనియర్ నాయకులు ఉష, కృష్ణయ్య, రాములు, మల్లేష్, కురుమయ్య, హనమదాసు తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ తరగతులు

**లింగాల:** నూతన విద్యా విధానాలను అన్ని పాఠశాలల యందు అమలు పర్చాలని ఎంఈఓ బషీర్ అహ్మద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5 రోజులుగా నిర్వహించిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ 5 రోజుల పాటు ఆర్పీలు నూతన విద్యా విధానంలో తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం, ఆంగ్లం పాఠ్యాంశాలను ఎలా బోధించాలనే దానిపై అవగాహన కల్పించిన అంశాలను అమలు చేయుటకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. నూతన విధానాలను అమలు పర్చి ఇంగ్లీష్ మీడియంను బలోపేతం చేయాలని ఎంఈఓ ఉపాధ్యాయులకు సూచించారు. ఆర్పీలు బాలాంజనేయులు, వెంకటేష్, అజాజ్, శ్రీను, జ్యోతి, సౌజన్య, భీమమ్మ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పెద్దకొత్తపల్లి:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులలో నైపుణ్యానికి వెలికి తీసే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు, పాల్గొన్నారు.

# బ్రిడ్జి నిర్మాణానికి మోక్షమెప్పుడో?

- నిర్మాణానికి నోచుకోని బైరాపూర్ వంతెన
- తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దారిలోనే రాకపోకలు
- వర్షాకాలంలో వరదలు వస్తే రాకపోకలకు ఇబ్బందే!



ప్రమాదకరంగా ఉన్న గాన్‌గట్టుతండా బ్రిడ్జి



బైరాపూర్‌లో తాత్కాలికంగా నిర్మించిన బ్రిడ్జి

**వెల్దండ:** ఏళ్లు గడుస్తున్నా మండలంలోని బైరాపూర్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. 2022, అక్టోబర్‌లో కురిసిన వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఉన్న బ్రిడ్జి కాస్త కొట్టుకుపోయింది. అధికారులు కంటి తుడుపు చర్యగా తాత్కాలిక సిమెంట్ పైపులతో దారిని ఏర్పాటు చేశారు. వర్షాకాలం వస్తుండటంతో వాగు ఉధృతి పెరిగితే మండలంలోని బైరాపూర్, శేరి అప్పారెడ్డిపల్లి, తూర్పుతండా, పడమటితండా, అజిలాపూర్, కుందారంతండా, లాల్‌తండా, చంద్రాయన్‌పల్లి గ్రామాలకు రాకపోకలకు నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఏళ్ల తరబడి వంతెన నిర్మాణానికి నోచుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు బ్రిడ్జి నిర్మాణానికి హామీలివ్వడం, తర్వాత విస్మరించడం పరిపాటిగా మారింది.

**వర్షాకాలం వచ్చిందంటే..**

గతంలో కురిసిన భారీ వర్షాలకు బైరాపూర్ వాగుపై ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో గ్రామంలోని రైతులతో పాటు విద్యార్థులు, గ్రామస్తులు రోజుల పాటు గ్రామానికే పరిమితమయ్యారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు తాత్కాలికంగా రూ.3లక్షలు ఖర్చు చేసి సిమెంట్ పైపులను ఏర్పాటు చేసి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. వర్షాకాలంలో మళ్లీ నీటి ప్రవాహం పెరిగితే సిమెంట్ పైపులు కొట్టుకుపోతాయని, మళ్లీ గ్రామానికి రాకపోకలు ఉండవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పనులు ప్రారంభించి, పూర్తి చేయాలని కొరుతున్నారు.

**రూ.3.50కోట్లు మంజూరు**

బైరాపూర్ వాగుపై కొట్టుకుపోయిన బ్రిడ్జిని ఆర్‌అండ్‌బీ డీఈఈ అధికారులు పరిశీలించారు. ఉన్న బ్రిడ్జి స్థానంలో కొత్తగా హై లేవల్ బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించడంతో ప్రభుత్వం అప్పట్లో రూ.3.50కోట్లు మంజూరు చేశారు. దీంతో కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకుని ఏళ్లు గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభించలేదు.

**ప్రమాదకరంగా గాన్‌గట్టుతండా బ్రిడ్జి**

మండలంలో గాన్‌గట్టుతండా, చెర్కూర్ మధ్యలో ఉన్న బ్రిడ్జి ప్రమాదభరింతగా మారడంతో సంబంధిత అధికారులు పరిశీలించారు. నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.15కోట్లు మంజూరు చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ గత వర్షాకాలంలో పనులు ప్రారంభించడానికి భూమిపూజ చేశారు. కానీ నేటికీ పనులను పూర్తి చేయలేదు.

**బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి**



వర్షాకాలంలో నీటి ప్రవాహానికి వాగుపై ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో గ్రామానికి పరిమితమయ్యాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో గతంలో తాత్కాలికంగా మరమ్మతు చేపట్టారు. వర్షాలకు మళ్లీ తాత్కాలికంగా ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. నూతన బ్రిడ్జికి నిధులు మంజూరైనా పట్టించుకోవడం లేదు.

– జంగయ్య, బైరాపూర్

**త్వరలోనే టెండర్లు పిలుస్తాం..**

గత ప్రభుత్వంలో బైరాపూర్ బ్రిడ్జి నిర్మాణానికి కాంట్రాక్టర్లు టెండర్లు వేశారు. ధరలు పెరగడంతో మళ్లీ కొత్తగా టెండర్లు వేయాలని కాంట్రాక్టర్లు కోరారు. అదే విధంగా గాన్‌గట్టుతండా బ్రిడ్జి నిర్మాణానికి కాంట్రాక్టర్లు టెండర్లు వేయడానికి ముందుకు రాలేదు. మళ్లీ బ్రిడ్జి నిర్మాణానికి అంచనా వేసి కొత్తగా టెండర్లు పిలుస్తాం. కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకున్న వెంటనే పనులను ప్రారంభించి పూర్తి చేయిస్తాం.

– మణిపాల్, పీఆర్ ఏఈఈ, కల్వకుర్తి

# లలిత కళల్లో పట్టు సాధించాలి



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్:** విద్యార్థులు చదువు తోపాటు లలిత కళల్లో పట్టు సాధించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. శనివారం పట్టణంలోని మినీ స్టేడియంలో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును ఆయన సందర్శించారు. చిత్రలేఖనం, పేరిణి నృత్యం, జానపద నృత్యాలు, సంగీతం శిక్షణా శిబిరాలను ఆయన తిలకించారు. శిక్షణకు సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిభావంతులైన ట్రినర్స్‌తో క్యాంపు ఏర్పాటుచేసినట్లు ఆయన పేర్కొన్నారు. శిక్షణ పొందుతున్న రంగాల్లో ప్రతిభ చాటుకొని, మంచి పేరు సాధించాలన్నారు. మంత్రి వెంట రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, నాయకులు మేకల నాగరాజు, ఎక్బాల్, సురేష్, పుట్టపాగ రాము తదితరులు ఉన్నారు.

### కేఎల్‌ఐ కాల్వపై బ్రిడ్జి నిర్మించాలని వినతి

**తాడూరు:** కేఎల్‌ఐ కాల్వపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ శనివారం మండలంలోని బలాన్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు జిల్లా ఇరిగేషన్ అధికారికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకుడు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన రైతులు అధికారిని కలిసి సమస్యను విన్నవించారు. బావాజిపల్లి, నేరలపల్లికి మధ్య ఉన్న కేఎల్‌ఐ కాల్వపై బ్రిడ్జి నిర్మిస్తే ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, దశరథం, పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత



**తిమ్మాజిపేట:** మండలంలోని గుమ్మకొండలో వధువు వివాహం కోసం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త జాహంగీర్‌ఖాన్ కూతురు పెళ్లికి ఇబ్బందులు పడుతున్నాడని స్థానిక నాయకులు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి నగదు అందజేశాడు. శనివారం మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఆయూబ్‌ఖాన్, నాయకులు వధువు ఇంటికి వెళ్లి నగదు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, హుసేన్‌ఖాన్, తరుఖాన్, నిరంజన్, మోజు, ఇమామ్, మహేష్ తదితరులు ఉన్నారు.

### మహిళ అదృశ్యం: కేసు నమోదు

**నాగర్‌కర్నూల్ క్రైం:** మహిళ అదృశ్యమైన ఘటనలో శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన శ్రావణి శనివారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. భర్త వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**రోడ్డు ప్రమాదంపై..**

**వెల్దండ:** మండలంలోని చెర్కూర్ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై ఈనెల 22న రాత్రి 11 గంటలకు గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీ కొట్టడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. రాఘయపల్లి గ్రామానికి చెందిన భార్యభర్తలు చవ్వ మల్లేష్, మంజులతో నలుగురి పిల్లలకు గాయాలయ్యాయి. శనివారం భర్త మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

### నర్సరీలను పరిశీలించిన ఎంపీడీఓ

**కోడేరు:** మండలంలోని జనుంపల్లి, నాగులపల్లి, నాగులపల్లి తండాలోని నర్సరీలో పెంచుతున్న మొక్కలను ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో మొక్కలు ఎండిపోకుండ జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు మురుగు కాల్వలు, పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### మాతా మరణాలను తగ్గింపునకు ప్రత్యేక దృష్టి

**కల్వకుర్తి టౌన్:** మాతా మరణాలను తగ్గింపునకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి లక్ష్మణ్ సూచించారు. శనివారం పట్టణంలోని క్లస్టర్ కార్యాలయంలో మాతా మరణాలపై పీహెచ్‌సీల వైద్యులు, ఏఎన్ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హైరిస్క్ కేసులపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని సీహెచ్‌సీలో ఉన్న హెల్ప్ డెస్క్‌లో సహాయం తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో వారి పరీక్షల నిమిత్తం 102 వాహనం సేవలను వినియోగించుకోవాలని, మాతా మరణాలు జరిగితే సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ భీమా నాయక్, ఆయా పీహెచ్‌సీల వైద్యులు అతావుల్లా ఖాన్, మంజు భార్గవి, సింధు, శివకుమార్, సీహెచ్ఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### మాజీ సర్పంచ్ విగ్రహావిష్కరణ



**వెల్దండ:** మండలంలోని చెదురుపల్లి మాజీ సర్పంచ్ వాల్యానాయక్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ శనివారం ఆవిష్కరించారు. వాల్య నాయక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా బొల్లిగుట్టతండాలో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, నాయకులు హన్మంత్ నాయక్, తిరుమల్‌రావు, బీఆర్‌ఎస్ యూత్‌వింగ్ అధ్యక్షులు యాదగిరి, నరసింహముదిరాజ్, శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### ఎల్‌ఓసీ చెక్కు అందజేత

**వెల్దండ/కోడేరు:** మండలంలోని భర్కత్‌పల్లి గ్రామానికి చెందిన రజితకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2.25 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం హైదరాబాదులోకల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంతో బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కోడేరు మండలంలోని జనుంపల్లి గ్రామానికి చెందిన భానుప్రకాష్ ఇటీవల కిమ్స్ ఆస్పత్రిలో గుండె మార్పిడి చికిత్స చేయించుకున్నాడు. సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.8లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నక్క వేణుగోపాల్‌యాదవ్‌లు బాధిత చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.

### గన్నీబ్యాగులు లేక అవస్థలు

**పెద్దకొత్తపల్లి:** మండల కేంద్రంలోని సింగిల్ విండో, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనగోలు కేంద్రంలో గన్నీ బ్యాగుల కొరత ఏర్పడింది. గన్నీ బ్యాగులు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. దీంతో ధాన్యం తూకం చేయకుండా కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. అధికారులు పట్టించుకొని గన్ని బ్యాగులను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

### ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

**కొల్లాపూర్:** మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని మాదాసి, మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పెద్దమల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మాదాసి, మాదారి కురువలు ఎస్సీ జాబితాలో ఉన్నప్పటికీ కొల్లాపూర్ నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు దశాబ్దాలుగా తమకు బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారన్నారు. అధికార యంత్రాంగం తీరుపై న్యాయపరంగా పోరాట చేస్తామన్నారు.

### మానవత్వాన్ని చాటిన అంబులెన్స్ సిబ్బంది

**కొల్లాపూర్ రూరల్:** మండలంలోని అమరగిరి గ్రామానికి చెందిన చెంచు దేవమ్మ 108 అంబులెన్స్‌లో మంగళ సూత్రం, వెండి మెట్టెలు, విలువైన పత్రాలు మరిచిపోయింది. అంబులెన్స్ సిబ్బంది గమనించి శనివారం దేవమ్మకు అప్పగించారు. సిబ్బంది వివరాల ప్రకారం కొన్ని రోజుల కిందట చెంచు దేవమ్మ మనుమడు అంజిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. హడావుడిలో ఆభరణాలు దేవమ్మ అంబులెన్స్‌లో మరిచిపోయింది. మరుసటి రోజు సిబ్బంది పర్సును గమనించి పంచాయతీ కార్యదర్శి నాగరాజుకు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని బాధితురాలికి తెలపగా శనివారం అంబులెన్స్ సిబ్బంది ఆభరణాలను బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు.

# ఆధ్యాత్మికతతో ప్రశాంతత



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

**చారకొండ:** ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని తిమ్మాయిపల్లిలో బొడ్రాయి పండుగను నిర్వహించారు. వేదపండితులతో మంత్రోచ్ఛరణల మధ్య బొడ్రాయిని ప్రతిష్ఠించారు. గ్రామస్తులు ఉదయం నుంచే బొడ్రాయి ప్రతిష్ఠ, అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం స్థాపన కార్యక్రమాలను పూర్తి చేశారు. సాయంత్రానికి బొడ్రాయికి బోనాలు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి తిమ్మాయిపల్లికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలన్నారు. గ్రామానికి చెందిన శ్రీహిందు గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత రంగినేని వెంకట్‌రావు ఆంజనేయ స్వామి ఆలయం నిర్మాణానికి రూ. 35 లక్షల విరాళం ప్రకటించడంతో గ్రామస్తులు సన్మానించారు. ఆలయంలో వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి సీసీ కెమెరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ పండిత్ రావు, మాజీ ఎంపీపీ నిర్మలవిజేందర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ గౌడ్, మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జైపాల్, నాయకులు బీముడు నాయక్, నిర్మల్ రావు, శ్రీపతి రావు, సురేందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి



**అచ్చంపేట రూరల్:** ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ మాధవి హెచ్చరించారు. శనివారం మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన అక్కారం, బక్కలింగాయపల్లిలో భూములను పరిశీలించారు. అలాగే సర్వేనెంబర్ 115 మోఖాపై విచారణ చేశారు. గ్రామ సభ నిర్వహించి గ్రామస్తులతో మాట్లాడారు. ప్రతి రైతుకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, ఆర్ఐ బాల్‌రాంనాయక్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### బాలలను పనిలో పెట్టుకోవద్దు

**నాగర్‌కర్నూల్ రూరల్:** బాలలను పనిలో పెట్టుకోవద్దని బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, రాంజన్‌లు అన్నారు. శనివారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అన్నారు. ప్రభుత్వాలు బాల కార్మిక చట్టాలను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పిడికిల్ల శ్రీనివాసులు, లక్ష్మయ్య, నిరంజన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### భగీరథ గేట్‌వాల్వ్‌లో తాచుపాము

**బల్మూర్:** మండల కేంద్రంలోని మిషన్ భగీరథ తాగునీటి సరఫరా గేట్‌వాల్వ్‌లో శనివారం తాచుపాము కనిపించింది. రోజులాగే వర్కర్ నవీన్ గేట్‌వాల్వ్ దగ్గరకు వెళ్లి మూత తీశారు. పాము కనిపించడంతో భయాందోళనకు గురయ్యాడు. ఈ విషయాన్ని కార్యదర్శి లక్ష్మణ్ దృష్టికి తీసుకెళ్లాడు. గ్రామ పంచాయతీ వర్కర్ల సహాయంతో తాచుపామును బయటకు తీశారు. దీంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.



### కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి కాదు

**మన్ననూర్:** మన్ననూర్ మాజీ సర్పంచ్ నిమ్మల శ్రీనివాసులుకు కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు, స్థాయి కాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎంఏ రహీం, వెంకటరమణ, హన్మంత్‌రెడ్డి, సత్యనారాయణ, శ్యామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రలోభాలకు ఆశపడి తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసి బీఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లాడని విమర్శించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణను విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

### ముగిసిన చెన్నకేశవ స్వామి ఉత్సవాలు



**తాడూరు:** మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణంలో ధ్వజస్తంభ, చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు మూడు రోజుల పాటు కొనసాగాయి. చివరి రోజు శనివారం ప్రాప్తకాల పూజ, యాంత్రాలకు అభిషేకం, రత్నబీజకాల యాసనములు ప్రాణప్రతిష్ఠ, బలిప్రదానం, ప్రతిష్టాత్మకంగా పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు చేపట్టారు. పూజారి రామకృష్ణ శర్మ, గ్రామస్తులు ఉన్నారు.

### సబ్సిడీపై జీలుగ విత్తనాలు

**చారకొండ:** రైతులు తమ వ్యవసాయ పొలాల్లో సారవంతం చేసేందుకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తుందని మండల వ్యవసాయ అధికారి తనూజరాజ్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆగ్రో రైతు సేవా కేంద్రంలో 9 క్వింటాల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారం కోల్పోతుందని, జీలుగా విత్తనాలతో పొలంలో సాగు చేసిన 40 రోజులకు దున్ని వరి పంట సాగు చేస్తే అ. ధిక దిగుబడులు వస్తాయన్నారు. రైతులు సబ్సిడీ జీలుగ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### హౌసింగ్ ఏఈగా పల్లవి

**వెల్దండ:** మండల హౌసింగ్ ఏఈగా పల్లవి శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం మండలాలకు ఏఈలను నియమిస్తున్నారు. ఇందులో భాగంగా సూర్యాపేట జిల్లా నుంచి వెల్దండ మండలానికి ఏఈగా పల్లవిని నియమించారు.

### మెడికల్ కిట్ల పంపిణీ



**కల్వకుర్తి రూరల్:** మండలంలోని ముకురాలలో శనివారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమకూర్చిన కిట్లను సూర్యలత కాటన్ మిల్ గుర్తింపు సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాశ్ రావు, బీఆర్‌ఎస్ కల్వకుర్తి పట్టణ అధ్యక్షుడు బావండ్ల మధులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గర్భిణులకు తమ వంతు సహకారం అందించాలని సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, దారముని గణేష్, పూరి రమేష్ పాల్గొన్నారు.

# నామమాత్రంగా ఉపాధి హామీ సామాజిక తనిఖీ

**బల్మూర్:** జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై శనివారం నిర్వహించిన 15వ సామాజిక తనిఖీ కార్యక్రమం నామమాత్రంగా నిర్వహించి అధికారులు చేతులు దులుపు కున్నారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలో 2024–25 సంవత్సరానికి సంబంధించి రూ.4.52 కోట్లతో చేపట్టిన 399 పనులు, పీఆర్ ఆధ్వర్యంలో నిర్మించిన 49 సీసీ రోడ్లు, రూ.15.18 లక్షలతో చేపట్టగా ఎస్‌ఆర్‌పీ ఆధ్వర్యంలో తొమ్మిది మంది డీఆర్‌పీలు, వీఎస్‌ఏలు గ్రామానికి నాలుగు రోజుల చొప్పున ఈనెల 23 వరకు గ్రామసభలు ఏర్పాటు చేసి సేకరించిన వివరాలను అడిషనల్ పీడీ రాజేశ్వరి సమక్షంలో ఈ సామాజిక తనిఖీలో వెల్లడించారు. ఈ తనిఖీలో టీఏలు, మెటీల నుంచి రూ.86,321 రికవరిలకు ఆదేశించగా,రూ.27,200 పెనాల్టీలు విధించినట్లు ఏపీడీ శ్రీనివాసులు తెలిపారు. కాగా సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహణ తీరు పట్ల గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో ఓ జరిగిన అవకతవకలపై తూతూమంత్రంగా నిర్వహించారని విమర్శలు వినిపించాయి. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ మహేష్, ఏపీఎం సువర్ణ ఉపాధి, సోషల్ అడిట్ సిబ్బంది పాల్గొన్నారు.

# సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ

**తెలకపల్లి:** మండలంలోని రచ్చకట్ట నుంచి నెహ్రూ చౌరస్తా వరకు శనివారం సైనికులకు మద్దతుగా శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యమన్నారు. చెన్నారెడ్డి, నరేంద్రచారి, రమణారెడ్డి, రవి కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవి, రామకృష్ణ పాల్గొన్నారు.



తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు